క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



భక్తులకు హారతిస్తున్న అర్చకుడు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాలలకు నోట్ పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 13,818 నోట్ పుస్తకాలు మంజూరయినట్లు ఎంఈఓ రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మోడల్‌స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి ఖాళీ పుస్తకాలు 5620, సింగల్ గీతలు 6060, రెండు లైన్లు 1289, గ్రాఫ్ పుస్తకాలు 849 వచ్చాయన్నారు. వీటిని మోడల్‌స్కూల్‌లో భద్రపరిచామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఆయా పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల చేత విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఎమ్మార్సీలు లక్ష్మీరెడ్డి, సిద్దమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

లైసెన్స్‌లు లేకపోతే జరిమానా

శిరివెళ్ల: లైసెన్స్‌లు లేక పోతే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ చిన్న పీరయ్య హెచ్చరించారు. శనివారం యర్రగుంట్లలో వాహన తనిఖీ జరిగింది. ఆయన మాట్లాడుతూ రోడ్డు రవాణ, మోటార్ వాహనాల నిబంధనల మేరకు వాహనాల తనిఖీ జరుగుతుందన్నారు. వాహనాల యజమానులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్, వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు కలిగి ఉండాలన్నారు. వాహనదారులు పదే, పదే నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జాబ్ మేళాలో 62 మందికి ఉద్యోగ అవకాశాలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ కళాశాలలో శనివారం జరిగిన ఉద్యోగ మేళాలో 62 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సుబ్బయ్య, చైర్మన్ రామకృష్ణారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ తెలిపారు. ఉద్యోగ మేళాకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లోని పది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి 130 మంది విద్యార్థులు రాగా అందులో 62 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

ఇక నుంచి పొదుపు కార్యకలాపాలు ఆన్‌లైన్



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

శిరివెళ్ల: ఇక నుంచి పొదుపు కార్యకలాపాలను ఆన్‌లైన్ చేస్తున్నట్లు వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల ఐక్య సంఘం కార్యాలయంలో క్లస్టర్ సీసీలు, ఎమ్మెస్ అకౌంటెంట్‌కు 5 రోజులశిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ పొదుపు కార్యకలాపాలు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం లోకస్ ఎమ్మెస్ అండ్ వీవో ప్రొఫైల్ విధానం అమలు చేస్తుందన్నారు. చిన్న సంఘాల నుంచి మండల ఐక్య సంఘం వరకు అన్ని వాటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. రుణాలు, వసూళ్లు, సమావేశాలు కూడా ఆన్‌లైన్‌వుతాయన్నారు. దీని వల్ల సిబ్బందిలో జవాబుదారి తనం పెరుగుతుందన్నారు. సంఘాల మహిళలకు ఎంతో ఉపయోగకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐబీ డీపీఎం కృష్ణమూర్తి, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె తన చాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. స్కాన్ సెంటర్లు లేదా డయాగ్నోస్టిక్ సెంటర్లు నిషేధిత చట్టంలోని నిబంధనలు పాటించకపోతే ఉపేక్షించవద్దన్నారు. లింగ నిర్ధారణ కోసం ప్రయత్నించినా, ప్రోత్సహించినా అలాంటివారిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఈచట్టంపై అవగాహన కోసం ఫ్లెక్సీల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కొత్త స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు రెన్యూవల్ నిమిత్తం నెల రోజుల ముందే అప్లై చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెన్యువల్‌కు వచ్చే స్కానింగ్ కేంద్రాలు హైపవర్ మిషన్ వాడాలని లేనిపక్షంలో రెన్యూవల్ నిలిపివేయాలని చెప్పారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సంఘాలు, పోలీసుల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు అధికారులతో కలిసి వైద్యులు స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించకుండా నగదు వసూలు చేసినట్లు 8 ఆసుపత్రుల్లో 33 ఫిర్యాదులు నమోదయ్యాయని వారికి నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ కోసం డీఓ లేఖను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, సీఐ సూర్యమౌళి, మదర్ సొసైటీ ఎన్‌జీఓ రామారావు, ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ లలిత, ఎన్టీఆర్ వేద సేవ కో–ఆర్డినేటర్ డాక్టర్ రూపేంద్ర నాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డెమో రవీంద్ర నాయక్, జిల్లా మానిటరింగ్ అధికారి సుమలత, వంశీ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు బెంచీల వితరణ



బెంచీలు అందజేసిన క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల మెడికల్ కళాశాలకు సిమెంట్ బెంచీలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, బాలకృష్ణ మాట్లాడుతూ నంద్యాల రోటరీ క్లబ్ గత కొన్నేళ్లుగా మానవ సేవయే మాధవసేవగా భావించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. వితరణ కార్యక్రమానికి రోటరీ క్లబ్ గవర్నర్ గోపాలకృష్ణ హాజరయ్యారు. రోటరీ సభ్యుల దాతల సహకారంతో రూ.40 వేలు విలువ చేసే బెంచీలను ప్రిన్సిపాల్ శ్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో పీడీజీలు రామలింగారెడ్డి, చిన్నపురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు వద్ద ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. మండల పరిధిలోని డీ.కొట్టాలకు చెందిన ఐదుగురు శనివారం కారులో ఆళ్లగడ్డకు వెళ్లారు. అక్కడ పనులు పూర్తి కాగానే స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. చిన్న కంబలూరు గ్రామం వద్దకు చేరుకోగానే ఎదురుగా ఆటో రావడంతో తప్పించబోయి ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ట్రాన్స్ ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టారు. గమనించిన గ్రామస్తులు పరుగున అక్కడికి వెళ్లి కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అయితే, వారంతా క్షేమంగా బయట పడటంతో ఊపిరి పిల్చుకున్నారు. కాగా ప్రమాదంలో కారు ముందుభాగా దెబ్బతినింది.

రోడ్డు నియమాలు పాటించాలి



సర్పాపురం నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రుద్రవరం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా రోడ్డు నియమాలు పాటించాలని ఎస్ఐ వరప్రసాదు సూచించారు. మండల పరిధిలోని నర్సాపురం నాలుగు రోడ్ల కూడలిలో శనివారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు లైసెన్‌తో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని చెప్పారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఎస్ఏ పోస్టులకు డిగ్రీ అర్హత మార్కులు తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ అర్హత మార్కులను తగ్గించాలని షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రాసేందుకు ఎస్సీ, ఎస్టీ దివ్యాంగ అభ్యర్థులు 45 శాతం మార్కులు, జనరల్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలనే నిబంధన అడ్డంకిగా మారిందన్నారు. 2024 జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు డిగ్రీలో 40 శాతం మార్కులు ఉన్న ఎస్సీ, ఎస్టీ దివ్యాంగ అభ్యర్థులకు అవకాశం కల్పించారన్నారు. ఇప్పుడు కొత్త నిబంధనతో వేలాది మంది అభ్యర్థులు అనర్హులుగా అవుతుండటంతో ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ధరణి, ఉపేంద్ర, మత్యనాయక్, రామకృష్ణ, జిల్లా నాయకులు కేషాలు నాయక్, నాగరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

గురురాజ విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పట్టణానికి చెందిన శ్రీ గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థిని నర్సిరెడ్డి 597 మార్కులు సాధించడంతో శనివారం డీఈఓ జనార్దన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. డీఈఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో సాధించిన మార్కుల స్ఫూర్తితోనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లే ఈమార్కులు సాధ్యమయ్యాయన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 590, 580, 550, 500 మార్కులకు పైగా 256 మంది సాధించారన్నారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగల పల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తాదులకు నిర్వాహకులు తగిన వసతులు కల్పించారు.

1 నుంచి ఉచిత లలిత కళల శిక్షణ శిబిరం

నంద్యాల(వ్యవసాయం): కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో ఉచిత లలిత కళలు, క్రీడల వేసవి శిక్షణ శిబిరం మే 1 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదన్ రావు, రవికృష్ణ, రంగనాథ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'కళా సాధన-2025' పేరిట కేఎస్ఎం మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శిబిరంలో శాస్త్రీయ నృత్యం, ఆధునిక నత్యం, శాస్త్రీయ, వాయిద్య, లలిత సంగీతం. చక్కటి చేతిరాత, హస్త కళలు, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పద్య పఠనం, సాంస్కృత శ్లోకాలు, కవితా గానం, కవితా రచన, చదరంగం, కరాటే, తైక్వాండో, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్: 8309735050, 9959307424 నంబర్లకు సంప్రదించాలన్నారు.

బేవరేజెస్ హమాలీలకు అండగా నిలబడతాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): బేవరేజెస్ హమాలీల నియామకాల్లో రాజకీయ జోక్యాన్ని సహించమని, వారికి అండగా నిలబడతామని వైఎస్సార్ సీపీ నాయకులు సన్నాల సాయిరాంరెడ్డి, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న కార్మికుల కడుపు కొట్టే చర్యలను తాము తిప్పికొడతామన్నారు. మామూళ్లు తీసుకొని అక్రమంగా నియమిస్తే సహించమన్నారు. న్యాయశాఖ మంత్రి ఫరూక్ జిల్లా అధికారులతో ఒక కమిటీ వేసి అందులో జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, ఆర్‌డీఓ, డీఆర్‌ఓ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, డీఎంఅండ్‌హెచ్ఓ, డిపో మేనేజర్ కమిటీ సభ్యులుగా నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. 170 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకుంటే ఇంటర్వ్యూలు నిర్వహించకుండా డబ్బులు ఇచ్చిన వారికి ఐఎంఎల్ కంపెనీలో హమాలీలుగా నియమిస్తున్నారన్నారు. పూర్తి ఆధారాలతో మంత్రి అనుచరుల అవినీతి బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. హమాలీలకు న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన నిలబడి పోరాడతామన్నారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నరసింహ, సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్, ఎంఆర్ నాయక్, రామరాజు, పుల్లా నరసింహులు, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వరాహ నృసింహ జయంతోత్సవం





వరాహనారసింహస్వామికి పూజలు చేస్తున్న వేదపండితుడు, సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: వరాహ నృసింహస్వామి జయంతోత్సవం వైభవపేతంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున వరాహ క్షేత్రంలో కొలువైన స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అనంతరం నిత్యపూజలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. స్వయంభూగా వెలసిన మూలమూర్తి శ్రీవరాహ నారసింహస్వామి వారిని వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ మంగళ వాయిద్యాలతో తిరుమంజనం నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. నూతన పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో సుదర్శన హోమం నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమం ముగించారు. ఈ పూజలు ముద్రకర్త కీడాంబి వేణుగోపాలన్, కల్యాణరంగన్, కృష్ణమాచారి, మఠం మేనేజర్ మాధవన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు శ్రీరంగరావు గోష్ఠి సభ్యులు ఆళ్లగడ్డ ఏడీఈ రవికాంత్‌చౌదరి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భూముల కౌలుతో రూ.19.72 లక్షల ఆదాయం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

నంద్యాల(అర్బన్): స్థానిక మండల ప్రజా పరిషత్ స్వాధీనంలో ఉన్న శ్రీమతి సింగం శెట్టి సుందరమ్మ భూముల మూడేళ్ల కౌలు వేలాల్లో ఎంపీడీఓ కార్యాలయానికి రూ.19.72 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎంపీపీ శెట్టి ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వే నెం. 112/ఏలోని 7.14, 159లో 16.58 మెట్ట భూములతో పాటు సర్వేనెం .1544/ఏలోని 5.02 తరి భూములకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించారు. 9 మంది రైతులు పాల్గొన్న ఈ వేలంలో మత్తేసు అనే వ్యక్తి ఎకరాకు రూ.36వేల చొప్పున అధిక పాట పాడి దక్కించుకున్నారు. మూడేళ్ల క్రితం ఎకరా రూ.13500తో ముగిసింది. అదే విధంగా తరి భూములకు సంబంధించి దేవేంద్రగౌడ్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణ, విజయభాస్కరరెడ్డి ఐదు మంది రైతులు పాటలో పాల్గొనగా దేవేంద్రగౌడ్ ఎకరాకు రూ.43 వేలు చెల్లించి కౌలు వేలాన్ని దక్కించుకున్నాడు. మూడేళ్ల క్రితం ఎకరా రూ.15 వేలు పలికింది. మొత్తం మీద మండల ప్రజా పరిషత్‌కు మూడేళ్లలో రూ.19.72 లక్షల కౌలు ఆదాయం లభించినట్లు అయ్యింది. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్‌డీ జ్యోతి, ఏఓ షాను తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో తేనెటీగల పెంపకం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ వెంకట శివప్రసాద్

నంద్యాల(అర్బన్): శాస్త్రీయ పద్ధతుల్లో తేనెటీగల పెంపకం చేపడితే లాభసాటి అవుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకట శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో చెంచు కుటుంబాలకు తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఐటీడీఏ పీఓ హాజరై మాట్లాడారు. చెంచుల జీవనోపాధిని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ తేనెటీగల పెంపకం వల్ల పంట సాగులో పుష్పాలు కూడా బాగా ఫలదీకరణం చెంది అధిక దిగుబడి రావడానికి తేనెటీగలు దోహద పడుతాయన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న చెంచులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఏఓ మురళీకృష్ణ, పీఎం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఆర్ విద్యార్థినికి అరుదైన అవకాశం



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్, ఎండీలు

నంద్యాల(అర్బన్): స్థానిక ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏ ఐ) బ్రాంచ్‌లో చదువుతున్న ఐశ్వరయ్యకు ప్రఖ్యాత సంస్థ ఆరడైన్ పుట్ లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశం లభించింది. రూ.19.4 లక్షల వార్షిక ప్యాకేజీ ఎల్‌పీఏతో ఆఫర్ లేటర్ వచ్చింది. ఈనేపథ్యంలో కళాశాల ఎండీ దినేష్‌రెడ్డి, చైర్మన్ వెంకటరామిరెడ్డి ఐశ్వర్యను శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన శివ

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని పాత హైవేపై గ్రామ దేవత చాగలమ్మ గుడి వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన శివ అనే వ్యక్తి చాగలమర్రిలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న మామ సుబ్బారాయుడు ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి తిరిగి సొంతూరికి మోటార్ సైకిల్‌పై బయలుదేరి వెళుతుండగా చాగలమ్మ గుడి వద్ద అదుపు తప్పి కింద పడటంతో శివ తలకు రక్త గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న అతని మామ సుబ్బారాయుడు చికిత్స కొరకు స్థానిక కెరళ ఆసుపత్రికి తరలించారు.

ఇంటర్ కొత్త సిలబస్‌పై శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ కొత్త సిలబస్‌పై అధ్యాపకులకు శనివారం ఆన్‌లైన్ ఓరియంటేషన్ తరగతులు ప్రారంభమయ్యాయి. నంద్యాల ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఈతరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మా రిన సిలబస్‌కు అనుగుణంగా బోధన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 238 మంది అధ్యాపకులు నాలుగు దశల్లో సాగే శిక్షణలో పాల్గొంటున్నట్లు డీఐఈఓ సునిత తెలిపారు. తొలి దశలో ఇంగ్లిష్, తెలుగు, హిందీ సబ్జెక్టులకు చెందిన అధ్యాపకులకు జరుగుతుందన్నారు. 28, 29 తేదీల్లో మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, బాటనీ సబ్జెక్టులకు చెందిన అధ్యాపకులకు, వచ్చే నెల 2, 3 తేదీల్లో హిస్టరీ, ఎకనామిక్స్, జువాలజీ, సివిక్స్ సబ్జెక్టుల అధ్యాపకులకు, 5, 6 తేదీల్లో కామర్స్, సంస్కృతం సబ్జెక్టు అధ్యాపకులకు శిక్షణ ఉంటుందని ఆమె వెల్లడించారు. జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ అధ్యాపకులకు ఇచ్చే ఓరియంటేషన్ తరగతుల షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని చెప్పారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని పిరికి పంద చర్యగా ఎంఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు అభివర్ణించారు. ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం నంద్యాలలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆసంఘాల నాయకులు బాయికాటి బెనర్జీ మాదిగ, చంటి మాదిగ మాట్లాడుతూ దాడిలో 28 మంది అమాయకుల ప్రాణాలు తీయడం బాధాకరమన్నారు. ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని, మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పాలకులకు డిమాండ్ చేశారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాముమాదిగ, శీను మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలసిమెలసి జీవించాలి



ఎస్‌పీజీ చర్చి రెండో పునఃప్రతిష్ఠ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ తంటెపూడి జార్జి కొర్నేలీయస్



కార్యక్రమానికి హాజరైన క్రైస్తవులు

చాగలమర్రి: ఎలాంటి వివక్ష లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని నంద్యాల సీఎస్ఐ డయాసిస్ బిషప్ రైట్.రెవ.డా.తంటెపూడి జార్జి కొర్నేలీ, ఆయన సతీమణి ఉమన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ. దాసరి జాషూవా కుమారి, కృష్ణ–గోదావరి డయాసిస్ డినరి చైర్మన్ డా. పీఏ వరప్రసాదరావు అన్నారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో శనివారం ఎస్‌పీజీ చర్చి ఫాదర్ రెవ. ఆర్ఏతఊ సంజీవరాజ్ ఆధ్వర్యంలో పరిశుద్ధ జన్మోత్సవాలయ 2వ పునఃనిర్మాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించి, చర్చి భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. దైవ సేవకుడు రిచర్డ్ డెండి షఫ్ఫర్డ్ సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రేమ, సంతోషం, సమాధానాలతో జీవించాలన్నారు. పరిశుద్ధ జన్మోత్సవాలయం ప్రతి ఒక్కరి ప్రార్థన నిలయమన్నారు. ఇంగ్లాండ్ దేశంలో పుట్టిన సర్.డెండి షఫ్ఫర్డ్ దొర ముత్యాలపాడు గ్రామాన్ని ప్రభువు పేరున ఎంచుకొని సేవ చేయడం మనకందరికి గర్వకారణమన్నారు. నంద్యాల సీఎస్ఐ డయాసిస్‌లో ఇంతటి చరిత్ర కలిగిన ఆలయం ఉండడం ఏసుక్రీస్తు మనకిచ్చిన భాగ్యమన్నారు. అనంతరం బైబిల్ వ్యాస రచన పోటీలలో గెలుపొందిన వారికి నగదు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా నంద్యాల అధ్యక్ష కాండపు ప్రధాన కార్యదర్శి జక్కం స్టాండ్లీ విలియం, సహ కార్యదర్శి పి.సాల్మన్, ట్రెజరర్ రెవ. కొత్తమాసి జోసఫ్, అసోసియేట్ ట్రెజరర్ రెవ. ఎం. చిరంజీవి, పీడీఓ బెల్ల ప్రభుదాస్, గురువులమ్మ అరుణకుమారి, ఎస్‌పీజీ చర్చి సంఘ పెద్దలు సంగీతరావు, దావీదు, లూకాప్రసాద్, సువార్తయ్య, ఏలియా విజయ భాస్కర్, ఎస్.విజయకుమార్, యు.ప్రసాద్, దైవాదినం, సాల్మన్‌రాజు, క్రిష్టఫర్, స్త్రీల మైత్రికమిటీ, షఫ్ఫర్డ్ యూత్, సండే స్కూల్ చిల్డ్రన్స్, గ్రామానికి చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు అనర్హుడు



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆ పదవికి అనర్హుడని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం నంద్యాల పట్టణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులకు రూ.600 కోట్లు ఎగ్గొట్టిన వ్యక్తి రాఘురామకృష్ణరాజు అని చెప్పారు. ఇప్పుడు పేదల ఇళ్లను కూల్చివేసి వారిని రోడ్డు పాలు చేశారని మండిపడ్డారు. ఆయన మాట తీరు మార్చుకోకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, నరసింహనాయక్, రాజశేఖర్, బాలవెంకట్, పుల్లా నరసింహ, తదితరులు పాల్గొన్నారు.